
RNI No: APTEL /25/A2860

సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 118 | పేజీలు : 4 | శనివారం 31 అక్టోబర్ 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



స్కూల్‌లో దారుణం.. పదో తరగతి విద్యార్థినిపై ఎలక్ట్రిక్ రంపంతో పాశవిక దాడి!



ఏపీలో భారీ నుంచి అతి భారీ వర్షాలు

- బంగాళాఖాతంలో మరింత బలపడిన అల్పపీడనం
- రేపటికి తుపానుగా మారే అవకాశం
- సోమ, మంగళవారాల్లో ఏపీలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు
- తీరం వెంబడి బలమైన ఈదురు గాలులు వీచే సూచన
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని ప్రభుత్వ హెచ్చరిక

సర్వం సిద్ధం

- ఏపీలో రేపే మున్సిపల్ ఎన్నికల పోలింగ్..
- ప్రతి పోలింగ్ కేంద్రంపై కెమెరా నీడ!
- ఆంధ్రప్రదేశ్‌లో పుర, నగర పాలక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- 36,351 మంది పోలీసులతో చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో భారీ బందోబస్తు
- సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు లేదా వెబ్‌కాస్టింగ్
- దాదాపు 75 వేల మంది పోలింగ్ సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు
- ఓటర్లు ఎలాంటి భయం లేకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్ఈసీ పిలుపు



అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో పురపాలక, నగర పాలక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేం దుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అనిల్ పునేఠా వెల్లడించారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రతి పోలింగ్ కేంద్రాన్ని కెమెరాల నిఘా పరిధిలోకి తీసుకొచ్చామని, ఓటర్లు ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ఏర్పాట్లపై ఆయన మీడియా సమావేశంలో పూర్తి వివరాలు అందించారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా స్థానిక ఎన్నికల కోసం 36,351 మంది పోలీసు - మిగతా3లో



ఉన్మాది దాడిలో గాయపడిన విద్యార్థిని బెంగళూరు తరలింపు

- గ్రీన్ చానల్ ఏర్పాటుకు లోకేశ్ చొరవ
- ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన విద్యార్థినిక
- మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలింపు
- మంత్రి నారా లోకేశ్ చొరవతో మెరుగైన వైద్యం ఏర్పాట్లు
- బెంగళూరు మణిపాల్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడిన లోకేశ్
- గ్రీన్ ఛానల్ కోసం కర్ణాటక ప్రభుత్వంతో సంప్రదింపులు
- అధికారులు, వైద్యులతో ఎప్పటికప్పుడు సమీక్ష

కడప, పులివెందులలో కూటమి నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారు

- వైసీపీ ఓటర్లను ఇంటింటికీ వెళ్లి బెదిరిస్తున్నారని అవినాశ్ ఆరోపణ
- అక్రమాలపై ఎలక్షన్ పిటిషన్లతో కోర్టుకు వెళతామని హెచ్చరిక
- రేపు మధ్యాహ్నం జగన్ పులివెందులకు వస్తారని వెల్లడి



అమరావతి

కడప జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ వేళ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కడప, పులివెందులలో అధికార టీడీపీ కూటమి నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని, వైసీపీ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పోలింగ్ రోజున వైసీపీని ఇబ్బంది పెట్టాలనే లక్ష్యంతోనే కూటమి నేతలు దౌర్జన్యాలకు దిగుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి, ఓట్లు వేయడానికి రావొద్దని వైసీపీ సానుభూతిపరులను బెదిరిస్తున్నారని - మిగతా3లో



ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం.. ఫ్యాక్టరీలో నలుగురు సజీవ దహనం

- ఢిల్లీలోని మంగోల్పురిలో ఘటన
- చెప్పుల ఫ్యాక్టరీలో చెలరేగిన మంటల్లో నలుగురు మృతి
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు, ఆరుగురిని కాపాడిన సిబ్బంది
- రబ్బరు కారణంగా మంటలు వేగంగా వ్యాపించాయని అంచనా
- ప్రమాద కారణాలపై పోలీసుల దర్యాప్తు ప్రారంభం

చలి మొదలవుతోంది

- రోజువారీ అలవాట్లలో ఈ 7 మార్పులు చేసుకోండి!
- చలికాలంలోనూ తగినంత నీళ్లు తాగాలంటున్న నిపుణులు
- వ్యాయామ సమయాన్ని వాతావరణానికి అనుగుణంగా మార్చుకుంటే మేలు
- చర్మానికి మాయిశ్చరైజర్, పెదాలకు లిప్ బామ్ వాడితే బెటర్
- కాలానుగుణ కూరగాయలు, ప్రొటీన్లు తీసుకోవాలని సూచన

మూడేళ్లు గడుస్తున్నా ఆ పనులు ముందుకు కదలడంలేదు

- పాలమూరు సాగునీటి ప్రాజెక్టుల పనులు ఎక్కడివక్కడే ఉన్నాయన్న డీకే అరుణ
- పరిహారం ఇవ్వకుండా ఇళ్లు ఖాళీ చేయించడంపై సీఎంకు ప్రశ్న
- పాలమూరు-రంగారెడ్డి, నెట్టెంపాడు, కల్వకుర్తి ప్రాజెక్టులు పూర్తి చేయాలని డిమాండ్



తాగునీటి కోసం రూ.120 కోట్లు..

- మంత్రి సీతక్క కీలక నిర్ణయం
- ఎల్‌నినో ప్రభావం ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు
- నాలుగు జిల్లాల్లో సింగూరు ప్రత్యామ్నాయానికి రూ.120 కోట్లు
- ఇతర జిల్లాలకు ఒక్కోటి రూ.కోటి చొప్పున నిధులు
- బోరుబావులు, ట్యాంకర్లతో నీటి సరఫరాకు ఏర్పాట్లు
- స్థానిక నీటి వనరులను అందుబాటులో ఉంచాలని ఆదేశం

హైదరాబాద్‌లో హైడ్రా చర్యలు

- రామాంతపూర్ పెద్ద చెరువు వద్ద కూల్చివేతలు
- రామాంతపూర్ పెద్ద చెరువు వద్ద నిర్మాణాల కూల్చివేత
- చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని తెలిపిన అధికారులు
- 40 ఏళ్లుగా పన్నులు కడుతున్నామంటున్న యజమానులు
- అధికారుల చర్యలపై హైకోర్టును ఆశ్రయించిన బాధితులు



హైదరాబాద్

హైదరాబాద్‌లోని రామాంతపూర్‌లో ఉన్న పెద్ద చెరువు వద్ద ఉద్రిక్తత నెలకొంది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలను 'హైడ్రా' అధికారులు కూల్చివేశారు. చెరువు స్థలాన్ని ఆక్రమణల నుంచి కాపాడే చర్యల్లో భాగంగా ఈ కూల్చివేతలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో ఉన్న ఓ భారీ షెడ్డును అధికారులు తొలగించారు. అధికారుల చర్యలతో తాము తీవ్రంగా నష్టపోయామని ఆస్తుల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 40 ఏళ్లుగా తాము క్రమం తప్పకుండా పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని వారు తెలిపారు. గత మూడు రోజులుగా అధికారులు సర్వేలు నిర్వహిస్తున్నారని, ఈ నేపథ్యంలోనే తాము హైకోర్టును ఆశ్రయించామని బాధితులు వివరించారు. - మిగతా3లో

సీమ వార్త సాయంకాలం

శనివారం 31 అక్టోబర్ 2026

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

అనంతలో అమానుషం..

చెక్కలు కోసే మిషన్ తో గొంతు కోశాడు..!!

....రాప్తాడు ఉన్నత పాఠశాలలో కలకలం

....పదో తరగతి విద్యార్థినిపై ఉన్మాది దాడి

....గొంతు కోసిన దుండగుడు

అనంతపురం అక్టోబర్ 31 సిమ వార్త సాయంత్రం.



రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం కలకలం చోటుచేసుకుంది. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై ఓ ఉన్మాది చెక్క మొద్దులు కోసే మిషన్‌తో దాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటనలో గోపిక లక్ష్మి అనే విద్యార్థిని తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. దాడి ఘటనతో పాఠశాల ప్రాంగణంలో భయాందోళనలు నెలకొన్నాయి. తరగతి గదిలోనే ఆ విద్యార్థి ఉన్మాది చేతి తీవ్రంగా గాయపడి నరకయాతన అనుభవించిన సంఘటన మానవత్వానికి మచ్చ తెచ్చేలా ఉంది.





జగన్ నీ అడ్డలోనే... మీ డిపాజిట్లు గల్లంతు..!!



సవాలు విసురుతున్న అభివృద్ధిపై చర్చకు రెడీనా.

...అభివృద్ధిని చూసి ఓటేయండి.. కూటమి అభ్యర్థులను గెలిపించండి.

.....కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించండి.

....అభివృద్ధిని అడ్డుకుంటున్న వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పండి

....గోరంట్ల మండలంలో కూటమి అభ్యర్థులకు మద్దతుగా....

మంత్రి సవిత ఎన్నికల ప్రచారం



గోరంట్ల అక్టోబర్ 31 సీమ వార్త సాయంత్రం.

అభివృద్ధిని చూసి ఓటు వేయాలని, అభివృద్ధిని అడ్డుకుంటున్న వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత ప్రజలకు పిలుపునిచ్చారు. గోరంట్ల మండలంలో కూటమి అభ్యర్థులకు మద్దతుగా మంత్రి సవిత విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భాగస్వామ్యంతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందన్నారు. గోరంట్ల మండలంలోని మారుమూల గ్రామాలకు సైతం రహదారి సదుపాయం కల్పిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు కూటమి అభ్యర్థులను ఆశీర్వదించి - మిగతా3లో







ఆ ఉన్మాదిని వదిలే ప్రసక్తే లేదు..!!

....రాప్తాడు ఘటనలో గాయపడిన విద్యార్థినిలను ఫోన్లో పరామర్శించిన చంద్రబాబు

.....విద్యార్థి తల్లిదండ్రులను ఓదార్చిన సునీత, మెరుగైన చికిత్స అందించాలని సూచన

....బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్న సునీత

రాప్తాడు అక్టోబర్ 31 సీమ వార్త సాయంత్రం.



రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన అమానుష దాడి తనను ఎంతో కలచి వేసిందని.. ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఈ ఘటనపై సమాచారం తెలిసిన వెంటనే ఆసుపత్రికి చేరుకున్న ఆమె, చికిత్స పొందుతున్న గోపికను చూశారు. అలాగే ఈ దాడిలో గాయపడిన మరో విద్యార్థిని, షాక్ గురైన మరో విద్యార్థిని పరామర్శించారు. గోపిక ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. అనంతరం కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులతో మాట్లాడడంతో పాటు, ముఖ్యమంత్రి చంద్రబాబు గారిచే ఫోన్లో వారిని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ పాఠశాలలో ఇలాంటి సంఘటన జరగడం.. అందునా అంత దారుణంగా దాడి చేయడం కలిచి వేసిందన్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ తీవ్రంగా స్పందించారన్నారు. ముగ్గురు నేతలూ నేరుగా ఫోన్ చేసి ఘటనకు సంబంధించిన వివరాలను ఆరా తీశారని.. తీవ్ర ఆవేదనకు గురైన తల్లిదండ్రులతో ఫోన్ లో మాట్లాడారన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని గట్టి భరోసా ఇచ్చారు. నిందితుడు ఎంతటి వాడైనా సరే, చట్టం ముందు కఠినంగా శిక్షిస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ యాక్షన్ అత్యంత వేగంగా, కఠినంగా ఉంటుందని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండటానికి ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. విద్యార్థుల రక్షణ కోసం ఇకపై ప్రతి పాఠశాల ప్రాంగణంలో భద్రతా నియమాలను కఠినతరం చేస్తామని స్పష్టం చేశారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబానికి మెరుగైన వైద్యంతో పాటు, ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలను త్వరితగతిన అందిస్తామన్నారు. నియోజకవర్గంలో మహిళలు, బాలికల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే సునీత తెలిపారు..



అంగన్వాడీలలో... పిల్లలకు అన్ని సౌకర్యాలు అందాలి..!!

.....ధర్మవరం సిడిపిఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన

శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్

.....అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, పోషకాహార పంపిణీపై కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష

....గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన సేవలు అందించాలని స్పష్టం


.....రికార్డుల నిర్వహణ, బయోమెట్రిక్ హాజరును క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్

ధర్మవరం,అక్టోబర్,31: సీమ వార్త సాయంత్రం.





ధర్మవరం పట్టణంలోని శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి (సిడిపిఓ) కార్యాలయాన్ని శనివారం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయానికి చేరుకున్న కలెక్టర్, వివిధ రికార్డులను, ఉద్యోగుల హాజరు రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బంది విధులపై ఆరా తీశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, పోషకాహార కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు మరియు చిన్నారులకు అందిస్తున్న పోషకాహార సరుకులు నాణ్యతతో, నిర్దేశిత పరిమాణంలో క్రమం తప్పకుండా పంపిణీ చేయాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఎప్పటికప్పుడు బరువు, ఎత్తు కొలతలు తీసి తీవ్ర లోపపోషణ ఉన్న పిల్లలను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అంగన్‌వాడీ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యాలు సరిగ్గా ఉండేలా చూసుకోవాలని, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సిడిపిఓ, సూపర్ వైజర్లు తరచుగా క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి, లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో ధర్మవరం సిడిపిఓ, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సీమ వార్త సాయంకాలం
శనివారం 31
అక్టోబర్ 2026

చలి మొదలవుతోంది..

ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతున్నాయి. చల్లని ఉదయాలు, పొడి వాతావరణం మన దినచర్యపై ప్రభావం చూపుతున్నాయి. చలిగా ఉందని వ్యాయామం మానేయడం, నీళ్లు తాగడం తగ్గించడం, చర్మ సంరక్షణను పట్టించుకోకపోవడం వంటివి ఈ కాలంలో ఎదురయ్యే సాధారణ సమస్యలు. వాతావరణానికి అనుగుణంగా కొన్ని అలవాట్లను మార్చుకుంటే ఆరోగ్యంగా, హాయిగా ఉండొచ్చు. చలికాలం మొదలవుతున్న వేళ పాటించాల్సిన ఏడు సూచనలు ఇవే.

1. తగినన్ని నీళ్లు తాగండి

చలికాలంలో దాహం తక్కువగా వేస్తుంది. దీంతో చాలామంది నీళ్లు తాగడం తగ్గిస్తారు. కానీ శరీరానికి అవసరమైన ద్రవాలు అందడం ముఖ్యం. రోజంతా తగినంత నీరు తాగాలి. గోరువెచ్చని నీరు, చక్కెర కలపని హెర్బల్ టీ, సూప్‌లు కూడా శరీరానికి ద్రవాలను అందిస్తాయి.

2. వ్యాయామ సమయాన్ని మార్చుకోండి

చల్లని ఉదయాల్లో వ్యాయామం చేయడం కష్టంగా అనిపించవచ్చు. అంతమాత్రాన శారీరక శ్రమను పూర్తిగా మానేయకూడదు. ఉదయం బదులు మధ్యాహ్నం లేదా సాయంత్రం ఎక్సర్‌సైజ్ చేయొచ్చు. ఇంట్లోనే యోగా, బలాన్ని పెంచే వ్యాయామాలు, డ్యాన్స్ చేయవచ్చు. బయట వ్యాయామం చేసేవారు వెచ్చటి దుస్తులు ధరించి, ముందుగా వార్మప్ చేయాలి.

3. చర్మ సంరక్షణపై శ్రద్ధ పెట్టండి

చల్లని గాలి, పొడి వాతావరణం వల్ల చర్మం పొడిబారడం, దురద, పెదాలు పగలడం వంటి సమస్యలు రావచ్చు. సున్నితమైన క్లెన్సర్ ఉపయోగించాలి. స్నానం చేసిన తర్వాత మాయిశ్చరైజర్ రాసుకోవాలి. పెదాలకు లిప్ బామ్ ఉపయోగించాలి. మరీ వేడిగా ఉన్న నీటితో స్నానం చేయడం తగ్గించాలి. పగటిపూట సన్‌స్క్రీన్ వాడటం కొనసాగించాలి.

4. కాలానుగుణ ఆహారాన్ని తీసుకోండి

చలికాలంలో లభించే క్యారెట్, పాలకూర, పచ్చిబఠానీ, కాలీఫ్లవర్ వంటి కూరగాయలను ఆహారంలో చేర్చుకోవాలి. వీటితో సూప్‌లు, పప్పు వంటకాలు చేసుకోవచ్చు. గుడ్లు, చేపలు, చికెన్, బీన్స్, పప్పుధాన్యాల వంటి ప్రొటీన్లు అందించే ఆహారాన్ని కూడా తీసుకోవాలి. దీంతో భోజనం సమతులంగా ఉంటుంది.

5. నిద్ర వేళలను క్రమబద్ధంగా ఉంచుకోండి

చలికాలంలో ఉదయాన్నే నిద్ర లేవడం కష్టంగా అనిపించవచ్చు. అయినా ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, మేల్కొనడం అలవాటు చేసుకోవాలి. పగటిపూట కొంతసేపు సహజమైన వెలుతురులో గడపడం కూడా నిద్ర-మేల్కొనే సమయాల క్రమాన్ని కొనసాగించేందుకు ఉపయోగపడుతుంది.

6. పొరలుగా దుస్తులు ధరించండి

ఉదయం, మధ్యాహ్నం ఉష్ణోగ్రతల్లో తేడా ఉండొచ్చు. అందుకే ఒకే మందపాటి దుస్తులకు బదులుగా అవసరాన్ని బట్టి తీసేయడానికి, వేసుకోవడానికి వీలుగా పొరలుగా దుస్తులు ధరించాలి. ఉదయాన్నే ప్రయాణించే వారు, రాత్రి ఆలస్యంగా ఇంటికి చేరుకునేవారు స్వెటర్ లేదా జాకెట్ వెంట ఉంచుకోవాలి. చిన్నపిల్లలు, వృద్ధులు చలి నుంచి అదనపు రక్షణ పొందేలా చూసుకోవాలి.

7. గాలి నాణ్యతను పరిశీలించండి

చలికాలంలో ఢిల్లీ-ఎన్‌సీఆర్ సహా కాలుష్యం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో గాలి నాణ్యత మరింత దిగజారవచ్చు. అందుకే బయట నడకకు లేదా పరుగు కోసం వెళ్లే ముందు స్థానిక ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ)ను పరిశీలించాలి. కాలుష్య స్థాయిలు ఎక్కువగా ఉంటే ఇంట్లోనే వ్యాయామం చేయడం మంచిది. ముఖ్యంగా శ్వాసకోశ, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు ఈ విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి.

రేపే తాడిపత్రి మున్సిపల్ పోలింగ్..

ప్రతి బూత్ పై సీసీ నిఘా

భారీ పోలీస్ బందోబస్తు.. ప్రశాంత ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు
స్వేచ్ఛగా ఓటేయండి.. భద్రత మాది: కమిషనర్ శివరామకృష్ణ



తాడిపత్రి, అక్టోబర్ 31, సాయంకాలం: తాడిపత్రి పట్టణ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కు సర్వం సిద్ధమైంది. రేపు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అధికారులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతరం నిఘా ఉంచుతామని మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ తెలిపారు. ఎన్నికల బందోబస్తు కోసం మొత్తం 550 మంది పోలీసులను నియమించామన్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా..

పట్టణంలోని సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, అక్కడ అదనపు బలగాలను మోహరిస్తున్నామని పోలీసు అధికారులు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లా కేంద్రం నుండి ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారన్నారు.

144 సెక్షన్ అమలు.. మద్యం దుకాణాలు బంద్..

ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో 144 సెక్షన్ అమలులో ఉందని, పోలింగ్ ముగిసే వరకు మద్యం దుకాణాలు మూసివేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. అనుమానితుల కదలికలపై నిఘా పెట్టామని, ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే, బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలందరూ నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కమిషనర్ శివ రామకృష్ణ కోరారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు తాగునీరు, నీడ, క్యూ లైన్లు సహా అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని ఆయన వెల్లడించారు.

ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం..

ఫ్యాక్టరీలో నలుగురు సజీవ దహనం

దేశ రాజధాని ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంగోల్‌పురి ప్రాంతంలోని ఒక ఫ్యాక్టరీలో రాత్రి చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో నలుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ఒక పాదరక్షల తయారీ పరిశ్రమ బేస్‌మెంట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది 20 ఫైర్ ఇంజన్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఫ్యాక్టరీలో చిక్కుకున్న మరో ఆరుగురిని రెస్క్యూ టీమ్ సురక్షితంగా బయటకు తీసుకువచ్చింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఫ్యాక్టరీలో పాదరక్షల తయారీకి వినియోగించే రబ్బరు నిల్వలు భారీగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయని అధికారులు భావిస్తున్నారు. దట్టమైన పొగ కమ్ముకోవడంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గాజు గ్లాసు గెలుపే భవిష్యత్తుకు భరోసా.

....గోరంట్ల మండలం కమ్మవారిపల్లి పంచాయతీ ఎముకలగుట్టపల్లిలో కూటమి జడ్పీటీసీ అభ్యర్థి దాసరి సునేత్ర అనిల్ యాదవ్ ముమ్మర ప్రచారం
పాల్గొన్న జనసేన మండలాధ్యక్షులు సంతోష్ కుమార్





గోరంట్ల అక్టోబర్ 31 సీమ వార్త సాయంత్రం. గోరంట్ల మండలం కమ్మవారిపల్లి పంచాయతీ పరిధిలోని ఎముకలగుట్టపల్లిలో కూటమి జడ్పీటీసీ అభ్యర్థి దాసరి సునేత్ర అనిల్ యాదవ్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలను, మహిళలను, యువతను, పెద్దలను కలుసుకుంటూ కూటమి అభ్యర్థులకు తమ అమూల్యమైన ఓటు వేసి మద్దతు తెలియజేయాలని అభ్యర్థించార.జడ్పీటీసీ అభ్యర్థి దాసరి సునేత్ర అనిల్ యాదవ్ కి గాజు గ్లాసు గుర్తుపై, ఎంపీటీసీ అభ్యర్థికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి తమ మద్దతు తెలియజేయాలని ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలను ప్రజలకు వివరిస్తూ నాయకులు గ్రామస్తులతో మమేకమయ్యారు.ఈ ప్రచార కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, జనసైనికులు, తెలుగుదేశం శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

500 నోటుతో బంగపడ్డ ఓటర్లు.. పేదల ఆశలపై నీళ్లు


పిల్లలకు బట్టలు కొందామనుకుంటే.. ఐదు వందలు ఇచ్చి చేతులు దులుపుకున్నారంట..



తాడిపత్రి, అక్టోబర్ 31, సాయంకాలం: తాడిపత్రి మున్సిపల్ ఎన్నికల వేళ ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్న తీరుపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఎన్నికల వేళ వచ్చే అమౌంట్ తో పిల్లలకు ఏమైనా కొందామని ఆశపడ్డ పేద, మధ్య తరగతి కుటుంబాల ఆశలపై రాజకీయ పార్టీలు నీళ్లు చల్లాయనే చర్చ జోరుగా సాగుతోంది. ప్రధాన పార్టీలలో ఒక పార్టీ వారేమో డబ్బుల పంపిణీ చేయకుండా చేతులెత్తేయగా, మరో పార్టీ వారేమో కేవలం రూ.500 ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఓటర్లు బహిరంగంగానే వాపోతున్నారు. ఒకో పార్టీ నుండి రూ.2 వేల చొప్పున రూ.4 వేలు వస్తే.. ఏదైనా ఇంటికి పనికొచ్చే వస్తువు కొందామని, పిల్లలకు బట్టలు కొందామని మధ్య తరగతి కుటుంబాలు ఎన్నో ఆశలు పెట్టుకున్నాయి. కానీ ఇప్పుడు చేతికి వచ్చిన రూ.500 చూసి ఓటర్లు డీలాపడ్డారు. “ఈ 500 తో ఏం వస్తుంది సార్.. కనీసం పిల్లలకు రెండు జతల బట్టలు కూడా రావు. కూరగాయలకు కూడా సరిపోదు” అంటూ మహిళా ఓటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో ఓటుకు రూ.1500 నుండి రూ.2000 వరకు ఇచ్చారని, ఈసారి మరింత ఎక్కువ వస్తుందనుకుంటే.. రూ.500 కి పడిపోయిందని ఆటో డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు చెబుతున్నారు. నిత్యావసర ధరలు పెరిగాయని, కానీ ఓటు రేటు మాత్రం తగ్గిందని అన్నారు. డబ్బుల పంపిణీలో డొల్లతనం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని, ఎన్నికల ముందు హడావుడి చేసే నాయకులు .. ఓటర్లకు ఇచ్చే సమయంలో మాత్రం మొహం చాటేస్తున్నారని స్థానికంగా చర్చ జరుగుతోంది.

గోరంట్ల ప్రాంత....పల్లె బాట కు కొత్త శోభ.

గోరంట్ల మండలానికి రహదారుల అభివృద్ధిలో మరో ముందడుగు.
.....గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ.. బీటీ రోడ్లకు నిధుల మంజూరు.



గోరంట్ల అక్టోబర్ 31 సీమ వార్త సాయంత్రం. గోరంట్ల మండలంలోని గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. మండలంలోని పలు గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా సింగిరెడ్డిపల్లి నుండి గంగాదేవిపల్లి, బూదిలి బ్రిడ్జి వరకు రూ,2 కోట్ల 41 లక్షలు, కొలింపల్లి రోడ్డు నుండి గుంటిపల్లి వరకు రూ,31 లక్షలు,పుట్టపర్తి మెయిన్ రోడ్డు నుండి బూచేపల్లి కొత్తపల్లి వరకు రూ,2 కోట్ల 35 లక్షలు నిధులు మంజూరు అయినట్టు మంత్రి తెలిపారు.గ్రామీణ ప్రాంతాల ప్రజల రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు,రైతులు,విద్యార్థులు, ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఆనంద వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపల్ ఎన్నికల విధుల్లో తప్పని ఇబ్బందులు..

భోజన కొరతతో అవస్థలు పడ్డ మహిళా ఉద్యోగులు, పోలీసులు
పోలింగ్ ముందు రోజే కష్టాలు.. ఆందోళనలో ఎన్నికల సిబ్బంది



తాడిపత్రి, అక్టోబర్ 31, సాయంకాలం: తాడిపత్రి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా విధులు నిర్వహిస్తున్న అధికారులకు పోలింగ్ ముందు రోజే కష్టాలు తప్పలేదు. భోజన కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఎన్నికల సిబ్బంది ఆందోళనలో పడ్డారు. ఆదివారం జరగనున్న పోలింగ్ కోసం ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమాన్ని ఈ రోజు తాడిపత్రి పట్టణ శివారు ప్రాంతంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేశారు. కళాశాల ఊరికి చాలా దూరంగా, శివారు ప్రాంతంలో ఉండటంతో చుట్టుపక్కల హోటళ్లు, భోజన వసతులు అందుబాటులో లేకపోవడంతో అధికారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ఎన్నికల విధుల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు, పోలీసులు వరుస క్రమంలో గంటల తరబడి లైన్ లో నిలబడి భోజనం లేక అవస్థలు పడ్డారు. గంటల తరబడి ఎన్నికల సామాగ్రి కోసం వేచి చూసిన అధికారులకు కనీసం భోజనం తగినంత ఏర్పాటు చేయకపోవడంపై అధికారుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. లక్షల రూపాయలు ఎన్నికల నిర్వహణకు ఖర్చు చేస్తున్నప్పుడు, విధులు నిర్వహించే సిబ్బందికి కనీసం భోజనం పెట్టలేరా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. రేపు ఉదయం 7 గంటల నుండే పోలింగ్ విధులకు వెళ్లాల్సి ఉంది. ఈరోజే భోజనం దొరకని పరిస్థితిలో రేపు పోలింగ్ రోజు పరిస్థితి ఏంటని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. రేపు పోలింగ్ ఉన్న నేపథ్యంలో ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, వెంటనే ఉన్నతాధికారులు స్పందించి భోజన వసతి ఏర్పాటు చేయాలని ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు కోరుతున్నారు.

జాల ఫ్యామిలీకి జనం జేజేలు.

గోరంట్ల 3 వ ఎంపీటీసీ అలివేలమ్మ గెలుపే లక్ష్యంగా ప్రచారం.
టిడిపి నేత ఈశ్వర ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం... అండగా నిలిచిన కూటమి నేతలు.






గోరంట్ల అక్టోబర్ 31 సీమ వార్త సాయంత్రం. గోరంట్ల మండలం గోరంట్ల పట్టణంలో 3 వ ఎంపీటీసీ అభ్యర్థి జ్వాలా అలివేలమ్మ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో జనం జేజేలు పలుకుతున్నారు. అత్యధిక మెజారిటీ నే లక్ష్యంగా ఎంపీటీసీ అభ్యర్థి అలివేలమ్మ భర్త ఈశ్వర ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా టిడిపి అభ్యర్థి అలివేలమ్మ సైకిల్ గుర్తు మరియు జడ్పీటీసీ అభ్యర్థి దాసరి సునేత్ర కు గ్లాస్ గుర్తుకు ఓటు వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుకుంటూ కూటమి నాయకుడు శిరిడి సాయి కాలనీ మరియు బూదిన్న ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గిరిధర్ గౌడ్, జయరాం, కమ్మ బాలకృష్ణ, డీలర్ రమేష్, రాజీవ్ కాలనీ సద్దాం, నిమ్మల కృష్ణమూర్తి,, కురవ మల్లికార్జున, త్యాగరాజు, వాటర్ ప్లాంట్ కలీం, తదితరులు ప్రచారంలో పాలు పంచుకున్నారు. కూటమి అభ్యర్థుల గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని సంక్షేమ పథకాలు మీ గుమ్మం చేరుతాయని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గాజు గ్లాస్ కు ఓటేద్దాం... సరైన నేతను ఎన్నుకుందాం.

గోరంట్ల 1 వ ఎంపీటీసీ పరిధిలో జనసేన అభ్యర్థి పాగుతోట వెంకటేష్ విస్తృత ప్రచారం.
అండగా ప్రచారంలో పాల్గొన్న జనసేన జిల్లా కార్యదర్శి సురేష్.



గోరంట్ల అక్టోబర్ 30 సీమ వార్త సాయంత్రం. గోరంత ఒకట వ జనసేన పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి పాగు తోట వెంకటేష్ గాజు గ్లాసు గుర్తుకు ఓటేసి సమాజానికి అవసరమైన నేత ను ఎన్నుకున్నామంటూ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు జనసేన పార్టీ నాయకులు. ఈ సందర్భంగా ఒకటవ ఎంపిటిసి పరిధిలోని మోహన్ రావు కాలనీ చౌడేశ్వరి కాలనీ, మూలభావి వీధి, కొలిమి చింతమాను వీధి తదితర ప్రాంతాల్లో జనసేన అభ్యర్థి వెంకటేష్ జన సైనికులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ప్రచారంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సురేష్ అభ్యర్థి ప్రచారానికి అండగా నిలుస్తూ జనసేన అభ్యర్థిని గెలిపిస్తే ఇంటింటికి సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయని తెలిపారు.



ఈ కార్యక్రమంలో వీర మహిళ కావేరి,గోవిందప్ప, శ్రీరాములు, చౌడేశ్వరి కాలనీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా

-- మండల అభివృద్ధే నా లక్ష్యం
-- తెదేపా ఎంపీపీ అభ్యర్థి నీరు గంటి చంద్రశేఖర్



సోమందేపల్లి అక్టోబర్ 31 సీమ వార్త సాయంకాలం తెలుగుదేశం ఎంపీపీ అభ్యర్థి నీరు గంటి చంద్రశేఖర్ శనివారం సాయి నగర్ లో విస్తృత ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ మంత్రి సవిత ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, సోమందేపల్లి మండలం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మండల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎంపీపీ అభ్యర్థి నీరు గంటి చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. మంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు 5 వ బ్లాక్ నుంచి అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఎన్నికల బరిలో నిలిచినట్లు చంద్రశేఖర్ తెలిపారు. ప్రచారంలో జనసేన, బిజెపి కార్యకర్తలతో కలిసి నీరు గంటి చంద్రశేఖర్ దంపతులు ప్రచారం చేశారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలన్నదే తన అభిమతమని స్పష్టం చేశారు. 5వ బ్లాక్ ప్రజలు తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపిస్తే, మండల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండటమే కాకుండా, వారి నమ్మకాన్ని నిల బెట్టుకుంటూ బాధ్యతాయుతంగా పనిచేస్తానని తెలిపారు. కూటమి మద్దతుతో ఎన్నికల బరిలో నిలిచిన తనను ఆశీర్వదించి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని నీరు గంట చంద్రశేఖర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

జగన్ నీ అడ్డలోనే... మీ డిపాజిట్లు గల్లంతు..!!

-మొదటిపేజీ తరువాయి

గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. పెనుకొండ నియోజకవర్గానికి కొంతమంది వలస పక్షులు ఇక్కడికి వచ్చి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, వారి మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధిని వైసీపీ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి వారికి ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పెనుకొండ నియోజకవర్గంలో పారిశ్రామికంగా గోరంట్ల ప్రాంతం అభివృద్ధి చెందుతోందని, మరిన్ని పరిశ్రమలు ఈ ప్రాంతానికి రానున్నాయని తెలిపారు. పరిశ్రమల రాకతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీ నుంచి సుమారు 50 మందికి కియాలో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలంటే కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ ఎన్నికల్లో గోరంట్ల జడ్పీటీసీ జనసేన అభ్యర్థి సునేత్ర యాదవ్‌కు గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేయాలని, అలాగే మండలపల్లి ఎంపీటీసీ అభ్యర్థి సావిత్రమ్మ కన్నారెడ్డి, పుట్టగుండ్లపల్లి ఎంపీటీసీ అభ్యర్థి శారదాబాయి, నార్శింపల్లి ఎంపీటీసీ అభ్యర్థి నాగభూషణ, బూదిలి ఎంపీటీసీ అభ్యర్థి శ్రావణి, రెడ్డిచెరువుపల్లి ఎంపీటీసీ అభ్యర్థి నిడిమామిడప్పలకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని మంత్రి సవిత ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీన బాలకృష్ణ చౌదరి, హసకలల స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్, ఎంపీపీ అభ్యర్థి జీనం నరేష్, జడ్పీటిసి అభ్యర్థి దాసరి సునేత్ర, అనిల్ యాదవ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, నిమ్మల శ్రీధర్, కన్నా రెడ్డి, నాగే నాయక్, కొత్తపల్లి నరసింహులు, డాన్స్ బాలాజీ, సీనప్పల్లి రవి మోహన్, చింతా భాస్కర్ రెడ్డి, మల్లాపల్లి వెంకటరెడ్డి, బెల్లాల చెరువు చంద్ర, గిరిధర్ గౌడ్, బిజెపి మండల అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ, జనసేన మండలాధ్యక్షులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెడ్పిటిసి అభ్యర్థి ముమ్మర ప్రచారం



సోమందేపల్లి అక్టోబర్ 31 సీమ వార్త సాయంకాలం సోమందేపల్లి మండల కేంద్రంలోని చాకార్లపల్లి, నడింపల్లి గ్రామాలలో కాంగ్రెస్ జడ్పీటీసీ అభ్యర్థి సుభాషిణి శనివారం ముమ్మర ప్రచారం చేశారు. అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ హస్తం గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు సజ్జారెడ్డి, మండల కన్వీనర్ గంగాధర్, రాయప్ప, వడ్డీ వెంకటేష్, సోమశేఖర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, నరసింహారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రమేష్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

జడ్పిటిసి అభ్యర్థి సిరియాల ప్రసాద్ ప్రచారానికి గ్రామాల్లో అపూర్వ స్పందన.



ఓబులదేవరచెరువు (అక్టోబర్31)సీమవార్త: సాయంత్రం. గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా తాను జడ్పిటిసి అభ్యర్థిగా పోటీ చేశానని సిరియాల ప్రసాద్ ముందుకు సాగుతున్నారు. తెలుగుదేశం పార్టీ తరపున జడ్పిటిసి అభ్యర్థిగా బరిలో దిగిన ప్రసాద్ గ్రామాల్లో ప్రచార హోరు కొనసాగిస్తున్నారు. కొండకమర్ల,సున్నంపల్లి తో పాటు పలు గ్రామాల్లో శనివారం ప్రచారం చేశారు.ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ఆయనకు మహిళలు,స్థానికులు బ్రహ్మరథం పెడుతూ స్వాగతం పలుకుతున్నారు. ప్రచారంలో ఆయన మాట్లాడుతూ.... రాజకీయానికి తాను కొత్తయినా టిడిపి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,రాష్ట్ర అభివృద్ధి పట్ల తాను ఆకర్షితున్ని అయ్యానన్నారు.టిడిపి అధికారంలో ప్రజలకు మరింత సంక్షేమం అందుతుందనే భరోసా ఉందన్నారు.తనను జడ్పిటిసి గా గెలిపించాలని అధిష్టానం అండదండలతో సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత దగ్గర చేర్చేందుకు శాసశక్తుల కృషి చేస్తానన్నారు. భవిష్యత్తులో ప్రజలకు మంచి జరగాలన్నా, రాష్ట్ర అభివృద్ధి మరింత సాధించాలన్నా అది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తోనే సాధ్యమవుతుందన్నారు.ముఖ్యంగా ఓడి చెరువు మండల ప్రజలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల పోటీలో ఉన్న ఎంపీటీసీ అభ్యర్థులు పిట్టా ఓబుల్ రెడ్డి,మోపురి అంజినప్పలను అలాగే మండల వ్యాప్తంగా ఉన్న ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించేందుకు సైకిల్ గుర్తుకు ఓటు వేసి వేయించాలని ఈ సందర్భంగా ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట పలువురు టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఇంటింటికి కాంగ్రెస్ పార్టీనాయకుల ఎన్నికల ప్రచారం

అమరాపురం అక్టోబర్ 31 సీమవార్త సాయంత్రం అమరాపురం మండల పరిధిలోని తమ్మడేపల్లి పంచాయతీలో కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ-2అభ్యర్థిని పి ఎన్ ఎస్ నాగరత్న శనివారం సిడబ్ల్యుసి సభ్యులు మాజీమంత్రి రఘువీరారెడ్డి ఆశీస్సులతో విస్తృత ప్రచారాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రంగనాథప్ప ఆధ్వర్యంలో తిప్పే స్వామి, శ్రీనివాస్, పవిత్ర,భాగ్యమ్మ, సావిత్రమ్మ, అనిల్ కుమార్ హనుమంత రాజు తదితరులుదేవదానపల్లి, నాగోనపల్లి, తమ్మడే పల్లి, తదితర గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి హస్తం గుర్తుకు ఓటు వేసి గ్రామ అభివృద్ధికి సహకరించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి, రఘువీరా రెడ్డిహయంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీకి త్వరలో పూర్వవైభవం వస్తుందని కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు.

స్నేహలతానగర్ ప్రచారంలో 4 బ్లాక్ ఎంపీటీసీ అభ్యర్థి గంగా రామాంజి

-- జగన్ చేసిన అభివృద్ధి సంక్షేమం గుర్తించండి



సోమందేపల్లి అక్టోబర్ 31 సీమ వార్త సాయంకాలం సోమందేపల్లి గ్రామంలోని స్నేహలతానగర్ లో శనివారం వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి గంగా జరీ రామాంజి విస్తృత ప్రచారం చేశారు. జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించమని ఓటర్లను అభ్యర్థించారు. మీ అమూల్యమైన ఓటు ఫ్యాన్ గుర్తుకు వేసి వేయించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ ప్రచారంలో గోవిందరెడ్డి, నరసింహమూర్తి, డీలర్ రామాంజనేయులు ఉన్నారు.

సిరివరంలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థి క్రిష్టప్ప ఇంటింటి ప్రచారం

గ్రామ సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని వెల్లడి



లేపాక్షి అక్టోబర్ 31 సీమ వార్త సాయంకాలం: మండలంలోని సిరివరం పంచాయతీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి వి. క్రిష్టప్ప ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. గ్రామంలోని వీధుల్లో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. తనను ఎంపీటీసీ అభ్యర్థిగా ఆదరించి, మద్దతు తెలపాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా క్రిష్టప్ప మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు జయరాం రెడ్డి మృతి.. పలువురి నివాళులు.

....మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

లేపాక్షి అక్టోబర్ 31 సిమా వార్త: సాయంత్రం. మండలంలోని కంచసముద్రం పంచాయతీ పరిధిలోని మామిడామాకులపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జయరాంరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లేపాక్షి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సయ్యద్ నిసార్, జిల్లా అధికార ప్రతినిధి అంజన్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆదినారాయణ తదితరులు జయరాం రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాధవరెడ్డి, శ్రీరామ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గాడ్రాళ్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, ఆన్సర్, గలిబీపల్లి శ్రీనివాసులు, మహబూబ్ భాష తదితరులు పాల్గొన్నారు. జయరాం రెడ్డి మృతి పట్ల పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

మృతిచెందిన కార్యకర్తకు నివాళి అర్పించిన శశి భూషణ్



సోమందేపల్లి అక్టోబర్ 31 సీమ వార్త సాయంకాలం సోమందేపల్లి మండలం చల్లాపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు హరిజన హనుమంత రాయుడు రాత్రి ప్రచారం ముగిసిన తర్వాత గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకొన్న హిందూపూర్ పార్లమెంట్ సభ్యులు బీకే పార్థసారధి అల్లుడు శశిభూషణ్ పటేల్ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

చల్లాపల్లి టీడీపీ కార్యకర్త హనుమంతు మృతికి మంత్రి సవితమ్మ సంతాపం



సోమందేపల్లి అక్టోబర్ 31 సీమ వార్త సాయంకాలం మండల కేంద్రంలోని చల్లాపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త హనుమంతు గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవితమ్మ శనివారం ఆయన నివాసానికి వెళ్లి భౌతికకాయంపై పార్టీ జెండా కప్పి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం హనుమంతు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కష్ట సమయంలో అధైర్యపడవద్దని పార్టీ తరపున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేణుకా నగర్ లో పంకా నేతల ప్రచారం

-- వైసిపి జెడ్పిటిసి గెలుపు కోసం ఇంటింటి ప్రచారం
-- పాల్గొన్న నాగభూషణ్ రెడ్డి, క్రిష్టప్ప, కంబాలప్ప

సోమందేపల్లి అక్టోబర్ 31 సీమ వార్త సాయంకాలం సోమందేపల్లి మండల కేంద్రంలోని రేణుకా నగర్ లో వైసిపి జెడ్పిటిసి అభ్యర్థి రామక్క గెలుపు కొరకు నాగభూషణ్ రెడ్డి క్రిష్టప్ప కంబాలప్ప తదితర వైసిపి నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ క్రమంలో ఇంటింటికి వెళుతూ వైసిపి అభ్యర్థి రామక్క ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. వైసీపీ అభ్యర్థి గెలుపుతో గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని రాజన్న రాజ్యం రావాలంటే క్షేత్రస్థాయి నుంచి పార్టీ పటిష్టం కావాలని అందుకోసం అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881